క్లుప్తంగా

నేడు ప్రజాప్రతినిధుల సమావేశం

బెజ్జూర్: జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బుధవారం మండల ప్రజాప్రతినిధులకు సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీపాల్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు జరిగే సమావేశానికి జెడ్పీటీసీ, ఎంపీపీ, సర్పంచులు, ఎంపీటీసీలు, మండల కోఆప్షన్ సభ్యులు, మండల రైతు బంధు కమిటీ అధ్యక్షులు, మండలంలోని రాజకీయ పార్టీల అధ్యక్షులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

'ఆశ్రమ పాఠశాలల మెస్ బిల్లులు చెల్లించాలి'



మాట్లాడుతున్న శేషారావు

కెరమెరి: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ ఉన్నత పాఠశాలల మెస్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, అనార్‌పల్లి సర్పంచ్ రాథోడ్ శేషారావు డిమాండ్ చేశారు. మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గతేడాదికి సంబంధించిన 11 నెలల బిల్లులతో పాటు ప్రస్తుతం విద్యా సంవత్సరానికి చెందిన నెల మెస్ చార్జీలను ప్రభుత్వం విడుదల చేయడం లేదని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు రూప్‌లాల్, శివాజీ, బల్వంత్, బాబునాయక్ తదితరులు ఉన్నారు.

'10 నుంచి సమ్మె చేస్తాం'



నోటీస్ అందజేస్తున్న ఎండీఎం వర్కర్లు

కెరమెరి: మధ్యాహ్న భోజన కార్మికులు ఈ నెల 10, 11, 12 తేదీల్లో టోకెన్ సమ్మె చేయనున్నట్లు ప్రకటించారు. ఈమేరకు మంగళవారం ఎంఆర్‌సీలో ఎంఐఎస్ అశ్వనీకి సమ్మె నోటీసు అందజేశారు. ఎండీఎం నాయకురాలు కవిత మాట్లాడుతూ ప్రభుత్వం హామీలు నెరవేర్చకుంటే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. జరిత, లలిత ఉన్నారు.

కౌటాల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని కోరుతూ మూడు రోజుల పాటు టోకెన్ సమ్మె చేయనున్నట్లు మధ్యాహ్న కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు శారద అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కార్యాలయంలో ఎంఈవో సోమయ్యకు వినతిపత్రం అందించారు. ప్రభుత్వం తమ డిమాండ్లు నెరవేర్చకుంటే ఈ నెల 16న నిరవధిక సమ్మె చేస్తామని హెచ్చరించారు. కార్మికులు డి.లక్ష్మి, సింధుబాయి, లక్ష్మి, తారబాయి, తానుబాయి, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అదాలత్

కౌటాల: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో బుధవారం విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఏడీఈ రాజేశ్వర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కౌటాల, చింతలమానెపల్లి, బెజ్జూర్, సిర్పూర్(టి) మండలాల్లో విద్యుత్ వినియోగదారుల బిల్లులు, ఇతర సమస్యల పరిష్కారానికి విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు తెలిపారు. నేడు ఉదయం 11 గంటల నుంచి అదాలత్ ఉంటుందని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. ఇతర వివరాలకు 9440814881నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

'అన్నదాతలపై వేధింపులు సరికాదు'



మాట్లాడుతున్న సిడాం గణపతి

కాగజ్‌నగర్‌టౌన్: అన్నదాతలపై పోలీసులు వేధింపులు సరికాదని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, బీఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిడాం గణపతి అన్నారు. కాగజ్‌నగర్ పట్టణంలోని తన నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. చింతలమానెపల్లి మండలం రుద్రాపూర్‌లో పండలిక్‌ను వారసత్వ భూమి విషయంలో పోలీసులు చితకబాదారని ఆరోపించారు. పోలీసుల సమక్షంలో బలవంతంగా సంతకాలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. సిర్పూర్ నియోజకవర్గంలో ఇలాంటి సంఘటనలు తరచూ చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. బాధితులకు బీఎస్పీ అండగా నిలబడుతుందన్నారు. సమగ్ర విచారణ జరిపి బాధిత రైతుకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో బీఎస్పీ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

చినుకుపడితే అంధకారమే!

- గాలి వీచినా కరెంట్ కట్
- నాలుగు మండలాలకు ఏళ్ల తరబడి అవాంతరాలు
- ప్రతిపాదనల్లోనే కౌటాల 132/33 కేవీ సబ్‌స్టేషన్
- పట్టించుకోని అధికారులు



బెజ్జూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రం

బెజ్జూర్: జిల్లాలోని సిర్పూర్ నియోజకవర్గంలో విద్యుత్ సమస్య ఏళ్ల తరబడి వెక్కిరిస్తోంది. చిన్నపాటి చినుకులు పడినా, గాలి వీచినా విద్యుత్ సరఫరా నిలిచిపోయి నాలుగు మండలాలు అంధకారంలో మగ్గిపోతున్నాయి. ఏళ్లుగా ఇదే తంతు నడుస్తున్నా ప్రత్యామ్నాయ మార్గాలపై అధికారులు దృష్టి సారించకపోవడంతో బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల, సిర్పూర్(టి) మండలాల వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నారు.

ఈజ్‌గాం సబ్‌స్టేషన్ నుంచి సరఫరా..

జిల్లాలో 1,22,680 గృహ కనెక్షన్లు ఉన్నాయి. ఇందులో కాగజ్‌నగర్ డివిజన్ పరిధిలో 66,737, ఆసిఫాబాద్ డివిజన్‌లో 55,943 గృహ అవసర కనెక్షన్లు ఉన్నాయి. కాగజ్‌నగర్‌లో వ్యవసాయ కనెక్షన్లు 7071 ఉండగా, ఆసిఫాబాద్ పరిధిలో 2903 కనెక్షన్లు ఉన్నాయి. బెజ్జూర్, చింతలమానెపల్లి, కౌటాల, సిర్పూర్(టి) మండలాలకు కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలోని 132/33 కేవీ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా చేస్తున్నారు. దాదాపు 170 కిలోమీటర్ల నుంచి ఈ నాలుగు మండలాల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా జరుగుతున్న క్రమంలో అనేక అవాంతరాలు ఎదురవుతున్నాయి.

నిత్యం సమస్యలు..

ఈజ్‌గాం సబ్‌స్టేషన్ నుంచి ఆయా మండలాలకు విద్యుత్ సరఫరా చేస్తుండడంతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఏ చిన్నపాటి వర్షం పడినా, గాలి వీచి కొమ్మ విరిగినా, సాంకేతిక సమస్య ఏర్పడినా గంటల కొద్ది విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోంది. దీంతో చిన్నపిల్లలు, వృద్ధులు ఇక్కట్లకు గురవుతున్నారు. రాత్రి వేళల్లో దోమల బెడద తీవ్రంగా ఉంటుంది. వర్షాకాలంలో తరచూ విద్యుత్ అంతరాయం ఏర్పడుతుండడంతో అనేక అవస్థలు పడుతున్నామని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈజ్‌గాం సబ్‌స్టేషన్‌లో ఏ మరమ్మతులు చేపట్టినా నాలుగు మండలాల ప్రజలు అంధకారంలో ఉండాల్సిన పరిస్థితి ఉంది. ఎక్కువగా అటవీ ప్రాంతం నుంచి లైన్ ఉండడం, అధికారుల పర్యవేక్షణ లోపం వంటి కారణాలతో ప్రజలకు కరెంట్ కష్టాలు తప్పడం లేదు.

కలగానే కౌటాల సబ్‌స్టేషన్..

కౌటాల మండలంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేస్తే ఈ నాలుగు మండలాలకు చాలా వరకు కరెంట్ కష్టాలు తీరుతాయి. ఈ నేపథ్యంలో కౌటాలలో 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణానికి అధికారులు గతంలో ప్రతిపాదనలు పంపారు. కానీ ఆ ప్రక్రియ ముందుకు సాగలేదు. బెజ్జూర్ మండలవాసుల ఇక్కట్లు తీర్చేందుకు రెండేళ్ల క్రితం పెంచికల్‌పేట్ మండల కేంద్రం నుంచి సులుగుపల్లి వరకు 33 కేవీ లైన్ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించి స్తంభాలు కూడా ఏర్పాటు చేశారు. కానీ అటవీశాఖ నుంచి అనుమతులు రాకపోవడంతో పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. కాగజ్‌నగర్ డివిజన్‌లో 33/11 కేవీ విద్యుత్ ఉపకేంద్రాలు 8 ఉన్నాయి. సిర్పూర్(టి) మండలంలో రెండు, సిర్పూర్(టి) మండల కేంద్రంలో ఒకటి, లోనవెల్లిలో ఒకటి, కౌటాల మండలం గుండాయిపేట్‌లో ఒకటి, కౌటాల మండల కేంద్రంలో ఒకటి, చింతలమానెపల్లి మండలం కర్జెల్లిలో ఒకటి, రవీంద్రనగర్‌లో ఒకటి, బెజ్జూర్‌లో ఒకటి, రెబ్బెనలో ఒకటి ఉన్నాయి. అయితే ఈజ్‌గాం నుంచి సరఫరాలో ఇబ్బందులు ఎదురైతే ఈ 33/11 కేవీ సబ్‌స్టేషన్ల ద్వారా ఎలాంటి ప్రయోజనం చేకూరడం లేదు. ఈ నేపథ్యంలో కౌటాలలోనే 132/33 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు చేసి నాలుగు మండలాల కరెంట్ కష్టాలు తీర్చాలని వినియోగదారులు కోరుతున్నారు. ఈ విషయమై కౌటాల ఏఈ రవీందర్‌ను వివరణ కోరగా 132/33 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణం కోసం త్వరలో భూమిపూజ చేస్తామని పేర్కొన్నారు.

మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి



సిర్పూర్ (టి): వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు



తిర్యాణిలో..



కెరమెరిలో..

తిర్యాణి: గ్రామ పంచాయతీల్లో విధులు నిర్వహిస్తున్న మల్టీపర్పస్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీవో జావిద్‌కు కార్మికులు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న మల్టీపర్పస్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి పనికి తగ్గవేతనం అందజేయాలని పేర్కొన్నారు. అర్హత కలిగిన సిబ్బందికి కారోబార్, బిల్ కలెక్టర్లుగా పదోన్నతులు కల్పించాలన్నారు. ఈనెల 6వ తేదీలోగా ప్రభుత్వం తమ సమస్యలు పరిష్కరించకుంటే నిరవధిక సమ్మె చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో మల్టీపర్పస్ కార్మికులు చిలుక రవి, గద్దల నరేశ్, సతీశ్, తిరుపతి తదితరులు ఉన్నారు.

కెరమెరిలో..

కెరమెరి: పంచాయతీ కార్మికులను రెగ్యూలర్ చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గద్దల వెంకటేశ్ అన్నారు. మంగళవారం ఎంపీడీవో సత్యనారాయణగౌడ్‌కు వినతిపత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ జీపీ కార్మికులకు పీఆర్‌సీలో నిర్ణయించిన బేసిక్ వేతనం రూ.19000 చెల్లించాలన్నారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

సిర్పూర్ (టి)లో..

సిర్పూర్(టి): గ్రామపంచాయతీ కార్మికులకు వేతనాలు తక్షణమే చెల్లించాలని కోరుతూ మంగళవారం సిర్పూర్(టి) మేజర్ గ్రామపంచాయతీ కార్మికులు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో రాజేశ్వర్‌కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమ్మె నోటీసు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామపంచాయతీ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెరిక శ్రీకాంత్, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్, మండల అధ్యక్షుడు పి.రాజ్ కుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్.గణేశ్, సిబ్బంది భార్గవ్, మారుతి, రాజమల్లు, మాజిత్ అలీ, ప్రమోద్‌కుమార్, భీమయ్య, హరిచంద్రప్రసాద్, రాజేందర్, ఆకాష్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాకేంద్రంలో..

ఆసిఫాబాద్‌అర్బన్: రాష్ట్ర వ్యాప్తంగా గ్రామపంచాయతీల్లో పని చేస్తున్న కార్మికుల హక్కుల సాధనలో భాగంగా ఈనెల 6వ తేదీ నుంచి నిరవధిక సమ్మె ప్రారంభిస్తున్నట్లు జేఏసీ నాయకులు బోగె ఉపేందర్ పేర్కొన్నారు. మంగళవారం జేఏసీ ఆధ్వర్యంలో నాయకులు జిల్లా కేంద్రంలో ఎంపీడీవో శశికళకు తన కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: ఈ నెల 6 నుంచి పంచాయతీ కార్మికులు సమ్మె నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్మికులు ఎంపీడీవో సుధాకర్‌రెడ్డికి నోటీసు అందజేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో పంచాయతీ కార్మికుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సమస్యల పరిష్కారానికి సమ్మెలో పాల్గొంటున్నట్లు కార్మికులు తెలిపారు. పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, నెలకు రూ. 19వేల వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి విలాస్, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

రెబ్బెనలో..

రెబ్బెన: పంచాయతీ కార్మికుల జేఏసీ పిలుపు మేరకు ఈనెల 6 నుంచి రాష్ట్రవ్యాప్త నిరవధిక సమ్మెకు సంబంధించిన సమ్మె నోటీసును మండల కార్మికులు మంగళవారం ఎంపీడీవో శ్రీనివాస్‌కు అందజేశారు. జేఏసీ నాయకులు వెంకటేశ్, రమేశ్, శంకర్, దేవాజీ, లక్ష్మణ్, అంజన్న, లాలూసింగ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన



శిబిరంలో పాల్గొన్న ప్రజలు

కాగజ్‌నగర్‌టౌన్: కొత్తపల్లి వెంకటలక్ష్మి –చంద్రయ్య మెమోరియల్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొత్తపల్లి శ్రీనివాస్, డాక్టర్ కొత్తపల్లి అనిత ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. మంగళవారం పట్టణంలోని కిమ్స్ మల్టీస్పెషలిటీ ఆస్పత్రిలో శిబిరాన్ని ఏర్పాటు చేశారు. కంటి పరీక్షలకు 16 మంది హాజరు కాగా, 9 మందికి శస్త్రచికిత్స అవసరమని వైద్యులు నిర్ధారించారు. లయన్స్ క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి సహకారంతో ఉచితంగా ఆపరేషన్లు చేయిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉచిత కంటి శిబిరం ప్రతీ మంగళవారం నిర్వహిస్తామని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఆప్తమాలజిస్ట్ వసి, గోపి తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ విత్తనాలు సద్వినియోగం చేసుకోవాలి



కంది విత్తనాలు అందజేస్తున్న అధికారులు

సిర్పూర్(టి): మండలంలోని రైతులు రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న సబ్సిడీ విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల కోఆప్షన్ సభ్యుడు కిజర్ హుస్సేన్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో నేషనల్ ఫుడ్ సెక్యూరిటీ మిషన్ ద్వారా ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వందశాతం సబ్సిడీ కంది విత్తనాలను రైతులకు అందజేశారు. ఎంపీటీసీలు సోహెల్ అహ్మద్, తుకారాం, ఏఈవోలు శ్రీనివాస్, కవిత, నేహా తబస్సుమ్, శోభ, నాయకులు చునార్కర్ ఉమాజీ, ఇపాత్‌హుస్సేన్, రైతులు పాల్గొన్నారు.

జిల్లాలో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కెరమెరి: గిరిజనులు అధికంగా ఉండే కుమురంభీం జిల్లాలోనే గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని సేవాలాల్ సేన జిల్లా అధ్యక్షుడు రూప్‌లాల్ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో కలెక్టర్ హేమంత్ బోర్కడేను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. అనంతరం రూప్‌లాల్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే గిరిజన బంధు ప్రకటించాలన్నారు. రాష్ట్రంలోని పది లక్షల మంది గిరిజనులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కోరారు. పోడు పట్టాలు రాని రైతుల భూములను మళ్లీ సర్వే చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోత్ రవినాయక్, నాయకులు తిరుపతి ఉన్నారు.

విద్యార్థులు ఐక్య ఉద్యమాలు చేపట్టాలి



మాట్లాడుతున్న జాఫర్

కెరమెరి: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలను తిప్పికొట్టేందుకు విద్యార్థులు ఐక్య ఉద్యమాలు చేపట్టాల్సిన అవసరముందని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ జాఫర్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం నూతన విద్యా విధానం పేరిటా విద్యార్థుల్లో విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రూ.5,117 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రియింబర్స్‌మెంట్‌లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. నాయకులు రాంచందర్, విజయ్, జంగు, తదితరులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతపై అవగాహన

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని వల్లకొండ గ్రామంలో మంగళవారం ఎస్వీఎం యాజమాన్యం, పర్యావరణ విద్యా కేంద్రం ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు.

భక్తిశ్రద్ధలతో వరుణయాగం

కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట్ శివాలయంలో మంగళవారం భక్తిశ్రద్ధలతో భక్తులు వరుణయాగం నిర్వహించారు. ఆలయ అర్చకులు అంబేద సంతోష్ ఆధ్వర్యంలో వరుణయాగం జరిగింది. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి హోమం చేశారు. విస్తారంగా వర్షాలు కురవాలని మరో 4 రోజుల పాటు యాగం నిర్వహించనున్నట్లు అర్చకులు సంతోష్ తెలిపారు.

దొడ్డి కొమురయ్య వర్ధంతి



నివాళులర్పిస్తున్న తహసీల్దార్ సరిత

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ తహసీల్దార్ కార్యాలయంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. తహసీల్దార్ సరిత మాట్లాడుతూ తెలంగాణ సాయుధ పోరాటంలో పేద ప్రజల పక్షాన పోరాటం చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. నిజాం రాజులకు, దేశ్‌ముఖ్‌లకు వ్యతిరేకంగా పోరాటం చేసి తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడన్నారు.

నేడు టీప, జేపీఎస్‌ల సమావేశం

కెరమెరి: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం ఉదయం 9 గంటలకు ఉపాధిహామీ పథకం, గ్రామ పంచాయతీ కార్మికుల సమావేశం నిర్వహించనున్నట్లు ఈజీఎస్ ఏపీవో మల్లయ్య తెలిపారు. హరితహారం, ఇంకుడు గుంతలు, లేబర్ రిపోర్టు, పోడు పట్టాల పంపిణీ తదితర అంశాలపై సమావేశం ఉంటుందని, సిబ్బంది సకాలంలో హాజరు కావాలని పేర్కొన్నారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్‌రూరల్: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను మంగళవారం పోలీసులు బాధితుడికి తిరిగి అప్పగించారు. ఈజ్‌గాం మార్కెట్‌లో నరేశ్ అనే వ్యక్తి ఫోన్ పోగొట్టుకున్నాడు. ఈజ్‌గాం పోలీసులకు ఫిర్యాదు చేయగా వెంటనే స్పందించిన ఎస్సై జగదీశ్, కానిస్టేబుల్ నయీంలు సీఈఐఆర్ పోర్టల్‌లో ఐఎంఈఐ నంబర్ ఆధారంగా సెల్‌ఫోన్‌ను గుర్తించి నరేశ్‌కు అప్పగించారు.

విద్యార్థులకు క్విజ్ పోటీలు

కాగజ్‌నగర్‌రూరల్: మండలంలోని గన్నారం జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాల విద్యార్థులు జిల్లాస్థాయి క్విజ్ పోటీల్లో బహుమతులు సాధించారు. ఆసిఫాబాద్ మోడల్ స్కూల్‌లో ఆర్థిక అక్షరాస్యతపై మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో గన్నారం పాఠశాలకు చెందిన విద్యార్థులు తీగల పూజరెడ్డి, అంజలిలు ద్వితీయ స్థానం పొందగా, ప్రశంసాపత్రాలతో పాటు రూ.7500 నగదు బహుమతి గెలుపొందారు. ఎంఈవో భిక్షపతి, పాఠశాల చైర్మన్, ఉపాధ్యాయులు వారిని అభినందించారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

కౌటాల: యువకులు ఓటు హక్కును కలిగి ఉండాలని తహసీల్దార్ సాయన్న అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని రైతువేదికలో బీఎల్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం 21వ తేదీ వరకు ఓటుహక్కు నమోదుకు గడువు పెంచిందన్నారు. స్పష్టమైన ఓటర్ జాబితాను రూపొందించాలని, ఓటు హక్కుపై యువతకు అవగాహన కల్పించాలనిచ సూచించారు. సమావేశంలో బీఎల్‌వోలు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాలు కరువు

ఆసిఫాబాద్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని టీఎస్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి మహేష్ అన్నారు. మంగళవారం డీఈవో కార్యాలయంలో విద్యార్థులకు సౌకర్యాలు కల్పించాలని కోరుతూ డీఈవో కార్యాలయం అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఆర్టీసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

తిర్యాణి: ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించడం సురక్షితమని ఆర్టీసీ విలేజ్ ఆఫీసర్ చిక్రం లక్ష్మణ్ అన్నారు. మంగళవారం మండలంలోని ఇర్కపెల్లి గ్రామంలో ఆర్టీసీ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు.

జంగుబాయి మృతికి కారకులను శిక్షించాలి

తిర్యాణి: ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లి మండలం దనోర గ్రామానికి చెందిన ఆదివాసీ మహిళ జంగుబాయిని గత నెల 20న అత్యాచారం చేసి హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఆదివాసీ సంఘాల ఆధ్వర్యంలో మండల కేంద్రంలో శాంతి ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ అనంతరాజుకు వినతిపత్రం అందజేశారు. ఎంపీపీ శ్రీదేవి, జెడ్పీటీసీ చంద్రశేఖర్, సర్పంచుల సంఘం జిల్లా అధ్యక్షుడు గుణవంత్‌రావు, తుడుందెబ్బ డివిజన్ అధ్యక్షుడు భగవంత్‌రావు, మోతీరాం ఉన్నారు.

నేడు పోడు పట్టాల పంపిణీ

బెజ్జూర్: మండల కేంద్రంలోని ఎస్వీ ఫంక్షన్‌హాల్‌లో బుధవారం పోడు పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ, డోకె రోజా రమణి –వెంకన్న, జెడ్పీటీసీ పంద్రం పుష్పలత, కోఆప్షన్ సభ్యుడు బషారత్ ఖాన్, బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు సిడాం సకారాం, పీఏసీఎస్ చైర్మన్ కుర్సింగా ఓంప్రకాష్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మధ్యాహ్నం 12 గంటలకు జరిగే కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అర్హులు 1297 మంది రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, పోడు రైతులు సకాలంలో హాజరు కావాలని కోరారు.

దహెగాంలో..

దహెగాం: మండలంలోని పోడు వ్యవసాయం చేస్తున్న రైతులకు నేడు పోడు పట్టాలను ఎమ్మెల్యే చేతుల మీదుగా పంపిణీ చేయనున్నట్లు ఎంపీపీ కంబగౌని సులోచన, జెడ్పీటీసీ తాళ్లపల్లి రామారావులు తెలిపారు. పోడు పట్టాల లబ్ధిదారులు కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ తీసుకురావాలని సూచించారు.

కౌటాలలో..

కౌటాల: మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో బుధవారం రైతులకు పోడు పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో నస్రుల్లాఖాన్ మంగళవారం తెలిపారు. నేడు మధ్యాహ్నం 3 గంటలకు సిర్పూర్(టి) ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పోడు పట్టాలు పంపిణీ చేస్తారని పేర్కొన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండలంలోని పోడు రైతులకు బుధవారం పట్టాలు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీవో సుధాకర్ రెడ్డి తెలిపారు. మండలంలోని బాలాజీఅనుకోడ రైతు వేదికలో ఉదయం 10గంటలకు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్యే కోనేరు కోనప్ప కార్యక్రమంలో పాల్గొంటారని ప్రజాప్రతినిధులు, పోడు రైతులు కార్యక్రమంలో పాల్గొనాలని కోరారు.

బూత్‌స్థాయి నుంచి బీజేపీని బలోపేతం చేయాలి



కరపత్రాలు అందజేస్తున్న ఆనంద్

రెబ్బెన: బూత్‌స్థాయి నుంచి బీజేపీ బలోపేతానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు కృషి చేయాలని బీజేపీ స్వల్పకాలిక విస్తారక్ ఆనంద్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం బీజేపీ మండల సమావేశాన్ని నిర్వహించిన అనంతరం గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బీజేపీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు గడపగడపకు బీజేపీ కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆత్మారాం నాయక్, బెల్లంపల్లి ప్రభారీ సుదర్శన్‌గౌడ్, జిల్లా అధికార ప్రతినిధి అంజనేయులుగౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు సునీల్‌చౌదరి, జిల్లా కార్యదర్శి కుందారపు బాలక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

మొక్కల లెక్కలపై విచారణ చేపట్టాలి



మాట్లాడుతున్న కోవ విజయ్

కెరమెరి: జోడేఘాట్‌లోని బృహత్ ప్రకృతి వనంలో మొక్కల లెక్కలపై విచారణ చేపట్టాలని తుడుందెబ్బ జిల్లా ఉపాధ్యక్షుడు కోవ విజయ్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రకృతి వనంలో 18వేల మొక్కలు నాటినట్లు చెబుతున్నా, అక్కడ కేవలం రెండు వేల మొక్కలు మాత్రమే నాటారని స్పష్టం చేశారు. సంబంధిత అధికారులు బినామీల పేర్లతో డబ్బులు దోచుకున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులు విచారణ చేపట్టి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో పోరు గ్రామాల జిల్లా అధ్యక్షుడు పెందోర్ రాజేశ్వర్, ఆదివాసీ నాయకులు ఆత్రం రాజేశ్వర్, భానుప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.